క్లుప్తంగా

పైడితల్లికి ఆషాఢం సారె



సారెతో ర్యాలీగా బయలుదేరిన దీక్షాపీఠం ప్రతినిధులు

విజయనగరం టౌన్‌: నగరంలోని వనంగుడిలో కొలువైన పైడితల్లికి ఉత్తరాంధ్ర జిల్లాల భవానీ దీక్షా సేవాపీఠం సభ్యులు బుధవారం ఆషాఢం సారె సమర్పించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్‌ వద్దనున్న వనంగుడి వరకు ర్యాలీగా వెళ్లారు. దీక్షాపీఠం ప్రతినిధి దుర్గామల్లేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి పసుపు,కుంకుమ, ఘటాలు సమర్పించారు.

సెంచూరియన్‌ను సందర్శించిన ఐఐసీటీ శాస్త్రవేత్త



శాస్త్రవేత్త శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న సెంచూరియన్‌ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్‌: మండలంలోని టెక్కలి సెంచూరియన్‌ విశ్వ విద్యాలయాన్ని ఇండియన్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ కెమికల్‌ టెక్నాలజీ (హైదరాబాద్‌) శాస్త్రవేత్త డాక్టర్‌ ఎస్‌. శ్రీధర్‌ బాబు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో పలు విభాగాలతో పాటు క్రీడా మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సెంచూరియన్‌లో క్రీడా సౌకర్యాలు చాలా బాగున్నాయని కితాబిచ్చారు. అనంతరం వర్సిటీ ప్రతినిధులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్‌ పీకే మహంతి, రిజిస్ట్రార్‌ డాక్టర్‌ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్‌ ఆర్‌ఎస్‌ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మాక్‌ డ్రిల్‌

విజయనగరం క్రైమ్‌: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ నగరంలోని ఫోర్టిసిటీ స్కూల్‌లో జిల్లా అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు, తన సిబ్బందితో బుధవారం మాక్‌డ్రిల్‌ నిర్వహించారు. చైర్మన్‌ కేవీపీ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అకస్మాత్తుగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎటువంటి చర్యలు తీసుకోవాలో ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్‌ చైర్మన్‌ చంటి, డైరెక్టర్లు మధు, అశోక్‌, నీలిమ, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రోయినా ఖాన్‌, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ ఉపాధ్యాయులకు చిరు జ్ఞాపికను అందిస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్‌: మండలంలోని ఒమ్మి ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. డెంకాడ మండలం పెద తాడివాడకు బదిలీ అయిన కె విజయలక్ష్మి, బొప్పడాం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయిన రూప లావణ్యకు సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యానందం, ఉపాధ్యాయులు రామకృష్ణ, పైడిరాజు, రాము, ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన



భక్తులకు ప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్‌ శంకర్‌ రెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్‌: మాసశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని కంటోన్మెంట్‌ గూడ్స్‌షెడ్‌ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆవరణలో బుధవారం ఆలయ చైర్మన్‌ రెయ్యి శంకర్‌ రెడ్డి నేతృత్వంలో అన్నసమారాధన నిర్వహించారు. సుమారు రెండువేల మందికి పైగా భక్తులకు ఆలయ ఈఓ కె.పద్మావతి చేతుల మీదుగా అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్‌, శోభారాణి, భీమ, సోమశేఖర్‌ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

గజపతినగరం: యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి(ఏఓ) పి.కిరణ్‌కుమార్‌ అన్నారు. మండలంలోని మరుపల్లి, ఎం.గుమడాం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతులకు రాయితీపై మినప,పెసర,మొక్కజొన్న విత్తనాలను అందజేశారు.

రాష్ట్రంలో అరాచక పాలన..

• నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ



కొల్లయివలసలో సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ సారథ్యంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్త బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పేరాపురం, వెంపడాం, గుంపాం, పతివాడ, కొల్లాయివలస, పసపాం, ఎరుకొండ గ్రామాలలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కూటమి మోసాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ హయాంలో సీఎంగా జగనన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హయాంలో అటు అభివృద్ధి లేదు, ఇటు సంక్షేమం లేదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి పదమూడు నెలలైనా ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయారన్నారు. కేవలం తల్లికివందనం మాత్రమే అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. అధికారం కోసం అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారని మండిపడ్డారు. ప్రజలను ఏవిధంగా మోసం చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసునన్నారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సిందేనని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడాన్ని తప్పుబట్టారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చేటప్పుడు తెలియదా అని ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి పథకాలు అమలు చేయాల్సిందేనని డిమాండ్‌ చేశారు. లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఎన్నికల సమయంలో సంపద సృష్టించి పేదలకు పంచుతానని చెప్పి.. ఉన్నవి అమ్మేస్తున్న ఘనత కూటమి నాయకులేదనని మండిపడ్డారు. బ్యాంకుల నుంచి అప్పులు చేసిన రూ. లక్షల కోట్లు ఎవరికి పంచుతున్నారో చెప్పాలని డిమాండ్‌ చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులకు దోచి పెట్టేందుకే రాజధాని అమరావతి పేరుతో వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధిపత్య పోరుతో నియోజకవర్గాన్ని గాలికి వదిలేసి అభివృద్ధిలో వెనక్కి నెట్టేశారని ఆరోపించారు. కూటమి వైఫల్యాలను ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్‌ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను గుర్తుపెట్టుకుని వచ్చే ఏడాదిలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీలకు ఓట్లతో గట్టిగా బుద్ధి చెప్పాలని డిమాండ్‌ చేశారు. అనంతరం చంద్రబాబు చేసిన మోసాలపై రూపొందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్‌ జిల్లా అధికార ప్రతినిధి రేగాని శ్రీనివాసరావు, వైస్‌ ఎంపీపీలు అల్లాడ రమేష్‌, ఎన్‌. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, బర్రి చినఅప్పన్న, మహంతి జనార్ధనరావు, దాడిశెట్టి త్రినాథరావు, పిన్నింటి ఎల్లంనాయుడు, కోరాడ మహేష్‌, ఎడ్ల రామకృష్ణ, పిన్నింటి నారాయణరావు, తాడిశెట్టి బాబు, వాళ్లె సన్యాసినాయుడు, గొంప సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.



గుంపాం బహిరంగ సభకు హాజరైన ప్రజలు



బ్రోచర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

కెప్టెన్‌ లక్ష్మీ సెహగల్‌కు నివాళులు



మాట్లాడుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి, రెడ్డి శంకరరావు

విజయనగరం గంటస్తంభం: స్వాతంత్య్ర సమర యోధురాలు, ఆజాద్‌ హిందూ ఫౌజ్‌ ఏర్పాటు చేసిన ఇండియన్‌ ఆర్మీ ఝాన్సీ రేంజ్‌కి కెప్టెన్‌గా వ్యవహరించిన లక్ష్మీ సెహగల్‌కు ఘన నివాళులర్పించారు. లక్ష్మీ సెహగల్‌ 13వ వర్ధంతి సందర్భంగా నగరంలోని 46 వార్డు ఎల్బీజీ నగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, తదితరులు లక్ష్మీ సెహగల్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం, మహిళా హక్కుల కోసం, సమ సమాజ సాధనే లక్ష్యంగా పోరాడిన ధీర వనిత లక్ష్మీ సెహగల్‌ అని కొనియాడరు. స్వతహాగా డాక్టర్‌ అయిన లక్ష్మీ సెహగలజీవితాంతం మహిళల హక్కుల కోసం పోరాడారని, ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలిగా పనిచేశారన్నారు. ఆమె సేవలకు గుర్తుగా పద్మశ్రీ అవార్డు ఇచ్చి కేంద్రం సత్కరించిందని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా యూనియన్‌ నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌ దుకాణాలకు వేలం..



కార్పొరేషన్‌ దుకాణాలకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

విజయనగరం: కార్పొరేషన్‌ అధీనంలో ఖాళీగా ఉన్న దుకాణాలకు సహాయ కమిషనర్‌ కిల్లాన అప్పలరాజు సమక్షంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. కార్పొరేషన్‌ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐడీఎస్‌ఎంటీ షాపింగ్‌ కాంప్లెక్స్‌లోని మూడు దుకాణాలకు.. కొత్తపేట నీళ్ల ట్యాంక్‌ వద్దనున్న ఒక దుకాణానికి వేలం నిర్వహించారు. వేలంలో దుకాణాలు దక్కించుకున్న వారికి కౌన్సిల్‌ అనుమతితో లీజుకు ఇవ్వడం జరుగుతుందని సహాయ కమిషనర్‌ అప్పలరాజు తెలిపారు. అదేవిధంగా మరికొన్ని దుకాణాలకు నిర్వహించాల్సిన వేలంపాటలో పాటదారులు ఆసక్తి చూపకపోవటంతో వాయిదా వేశారు.మరలా ఆగస్టు 5న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతినెలా క్రమం తప్పకుండా అద్దెలు చెల్లించి కార్పొరేషన్‌కు సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, సీనియర్‌ అసిస్టెంట్‌ అప్పలరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాండింగ్‌ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్‌ విడుదల



నోటీస్‌బోర్డులో ఎన్నిక వివరాలను సంస్థ కార్యదర్శి హోదాలో అతికిస్తున్న సహాయ కమిషనర్‌ కిల్లాన అప్పలరాజు

విజయనగరం: విజయనగరం నగరపాలక సంస్థ స్టాండింగ్‌ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్‌ విడుదలైందని కమిషనర్‌ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు సంస్థ కార్యదర్శి హోదాలో సహాయ కమిషనర్‌ కిల్లాన అప్పలరాజు ఎన్నికకు సంబంధించిన వివరాలను బుధవారం నోటీసు బోర్డులో అతికించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్‌ 59 అనుసరించి మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ – అర్బన్‌ డవలప్‌మెంట్‌ వారి ఆదేశాల ప్రకారం విజయనగరం నగరపాలక సంస్థ స్టాండింగ్‌ కమిటీ (ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ) ఎన్నిక ఆగస్టు 11న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌ లేదా అధీకృత అధికారి సమక్షంలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ జరుగుతుందన్నారు. జూలై 31న దాఖలైన నామినేషన్ల వివరాలు ప్రకటించనున్నట్లు తెలిపారు. 31వ తేదీ నామినేషన్ల స్క్రూటీ ప్రక్రియ నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు అర్హులైన అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నామని తెలిపారు. ఆగస్టు 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ.. నాలుగు గంటలకు తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. ఆగస్టు 11వ తేదీ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పోలింగ్‌ నిర్వహించి, సాయంత్రం ఎన్నికైన సభ్యుల పేర్లు వెల్లడించనున్నట్లు తెలిపారు.

పర్యావరణానికి విఘాతం కలిగించొద్దు..

విజయనగరం: పర్యావరణానికి విఘాతం కలిగించొద్దని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్‌ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. అనధికారికంగా ప్రతి ఇంటి గేటుకు అమర్చిన ప్లాస్టిక్‌ ప్రకటిత బోర్డులను కమిషనర్‌ ఆదేశాల మేరకు ప్రణాళిక సిబ్బంది తొలగించారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. నగరంలో ప్లాస్టిక్‌, ఫోమ్‌ బోర్డులను నిషేధించినట్లు చెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి బోర్డులు అతికిస్తే చర్యలు తప్పవన్నారు.

లెంకవీధి డీలర్‌పై 6ఏ కేసు నమోదు

విజయనగరం ఫోర్ట్‌: నగరంలోని లెంకవీధిలో డిపో నిర్వహిస్తున్న డీలర్‌ కె. సుజాతపై 6ఏ కేసు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి కె. మధుసూదనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 బియ్యం బస్తాలు తక్కువగా ఉన్నందున కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తక్షణమే స్పందించాలి..

• ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్‌: శక్తి టీమ్‌ సభ్యులు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఏఎస్పీ పి. సౌమ్యలత అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్‌ కార్యాలయంలో శక్తి టీమ్స్‌ సభ్యులతో సమావేశమై.. వారి పనితీరును సమీక్షించారు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో గస్తీ చేపట్టడంతో పాటు పాఠశాలలు, కళాశాలలను సందర్శించాలని సూచించారు. విద్యార్థులకు శక్తి యాప్‌, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో శక్తి వారియర్స్‌ బృందాలను నియమించాలన్నారు. ఈ బృందంలో ఒక టీచర్‌, ఐదుగురు విద్యార్థులుండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమీక్ష సమావేశంలో మహిళా పోలీస్‌స్టేషన్‌ డీఎస్పీ ఆర్‌.గోవిందరావు, ఇన్‌స్పెక్టర్‌ ఈ.నరసింహమూర్తి, ఎస్సైలు శిరీష, దేవి, సాగర్బాబు, గోపాలరావు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అప్రమత్తం

నెల్లిమర్ల: మహిళా సంరక్షణ పోలీసులు గ్రామాల్లో పర్యటిస్తూ నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బి. గణేష్‌ సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గంజాయి వినియోగం, రవాణా సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. యువత గంజాయికి, మద్యానికి బానిసలుగా మారకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

అక్రమ అరెస్టలతో భయపడేది లేదు



మాట్లాడుతున్న మహంతి జనార్దనరావు, తదితరులు

పూసపాటిరేగ: అక్రమ అరెస్టలతో భయపడేది లేదని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మహంతి జనార్దనరావు అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ కుట్రలతోనే ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్‌ చేశారన్నారు. కూటమి ప్రభుత్వపు దుర్మార్గపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను సామాజికవేత్తలు, ప్రజాస్వామవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. లిక్కర్‌ స్కామ్‌ రెడ్‌బుక్‌ రాజ్యాంగం సృష్టేనని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలన లోపాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి బర్రి చినఅప్పన్న, కొత్తకోట శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే తీరుపై ఫిర్యాదు

డెంకాడ: మండలంలోని మోదవలసలో ఇటీవల జరిగిన రీ సర్వేలో మా భూమిని తక్కువగా నమోదు చేశారని.. విచారణ జరిపి తిరిగి మా పేరిట మార్చాలని రైతు కాగితాల సత్యనారాయణ మండల తహసీల్దార్‌ రాజారావుకు బుధవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బంగార్రాజుపేటకు చెందిన తను మండలంలోని మోదవలస రెవెన్యూ పరిధిలో 2016లో సర్వే నంబర్‌ 104-1 లో ఎకరా 78 సెంట్లు భూమి కొనుగోలు చేశానన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులు వన్‌ బీతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఇచ్చారన్నారు. ఈ భూమిలో 2021 సంవత్సరంలో 0.26 సెంట్లు ఒకరికి.. 0.93 సెంట్లు మరొకరికి అమ్మానని వివరించారు. కొనుగోలు చేసిన వారికి కూడా వన్‌ బీ, పట్టాదారు పాస్‌పుస్తకాలు అధికారులు మంజూరు చేశారన్నారు. మిగిలిన ఉన్న భూమి తన పేరిట ఉండేదన్నారు. ఇటీవల మోదవలసలో రీ సర్వే జరగ్గా తన పేరిట నా పేరిట, విక్రయించిన వారి పేరిట మొత్తం 1.78 సెంట్లు ఉండాల్సిందికి గాను 1.34 ఎకరాలుగా నమోదు చేశారని చెప్పారు. ఈ విషయాన్ని ఆర్‌ఓఆర్‌ డీటీ, తహసీల్దార్‌ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

• గైనకాలజిస్ట్‌ సుధాకుమారి



అవగాహన కల్పిస్తున్న గైనకాలజిస్ట్‌ సుధాకుమారి

విజయనగరం: గర్భిణీలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని గైనకాలజిస్ట్‌ సుధాకుమారి సూచించారు. రోటరీ సెంట్రల్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్‌నగర్‌ కాలనీ అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌లో గర్భిణులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించి పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అరటిపండ్లు, ఆకుకూరలు, క్యారెట్లు, గుడ్లు, పాలు వంటి బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రక్తహీనతకు గురికాకుండా ఐరన్‌ శాతం ఎక్కువగా ఉండే ఆకుకూరలను అధికంగా తీసుకోవాలని సూచించారు. రోటరీ సెంట్రల్‌ క్లబ్‌ అధ్యక్షుడు విజయకుమార్‌ అగర్వాల్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో క్లబ్‌ కార్యదర్శి ఉదయ్‌, ప్రతినిధులు శంకర్‌రెడ్డి, టీఎల్‌ఎన్‌ మూర్తి, కల్యాణ్‌, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం పరబ్రహ్మ స్వరూపం



వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

విజయనగరం: పుస్తకం పరబ్రహ్మ స్వరూపమని మాన్సాస్‌ కరస్పాండెంట్‌ డాక్టర్‌ కేవీ లక్ష్మీపతిరాజు అన్నారు. పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్‌ ఆధ్వర్యంలో విజయనగరం ఫోర్ట్‌ క్యాంపస్‌లో గల స్కూల్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పుస్తకాలు, గ్రంథాలయాలతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ ముడిపడి ఉందన్నారు. విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ఆవశ్యకతపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన బి. మాళవిక, బి. గౌరీశ్వరి, వి. జ్యోతిర్మయి పట్నాయక్‌లకు గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్‌, స్కూల్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ బీఎస్‌ఎన్‌ రాజులతో కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్‌ జక్కు రామకృష్ణ, రచయిత కాగుపాటి నారాయణమూర్తి, సంఘం కార్యదర్శి సుభద్రాదేవి, కళాశాల అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ కె. హరికృష్ణ ప్రసాద్‌, తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, సభ్యులు

• సీఐటీయూ నాయకులు

విజయనగరం గంటస్తంభం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్‌ వర్కర్లపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు ఎంఈఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శానిటేషన్‌ వర్కర్లు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శానిటేషన్‌ వర్కర్ల యూనియన్‌ కార్యదర్శి వై. నందిని, సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ. జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. పార్ట్‌ టైమ్‌ వర్కర్లని చెప్పి ఫుల్‌ టైమ్‌ పని చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అధికారులు, పాలకులు స్పందించి కనీస వేతనం రూ. 12 వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అలాగే నెలలో రెండు రోజుల సెలవులు మంజూరు చేయాలని కోరారు. అలాగే చీపుర్లు, ఫినాయిల్‌, బ్లీచింగ్‌ వంటి సామగ్రి, చెప్పులు, యూనిఫారాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పార్వతి, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

• జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు



పినతాడివాడ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు

డెంకాడ: వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి డీవీ మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని పిన తాడివాడ గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి మురుగుకాలువలు, పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త సంపద కేంద్రాన్ని పూర్తి స్థాయిలో నిర్వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం సచివాలయంలో క్లోరినేషన్‌, ట్యాంక్‌ క్లీనింగ్‌ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఎమ్మెల్యే మాటలు సమంజసం కాదు

• వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్‌ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్‌ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు

పూసపాటిరేగ: మాజీ మంత్రి ఆర్‌కే రోజా మీద జనసేన ఎమ్మెల్యే బొల్లిశెట్టి తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్‌ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పేరాపురంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పబ్లిక్‌ మీటింగ్‌ మాజీ మహిళా మంత్రిని అగౌరపరచడం సిగ్గుచేటన్నారు. గతంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ సైతం చెప్పు తీసి కొడతా.. గుడ్డలూడదీసి కొడతా.. వంటి వ్యాఖ్యలు చేశారన్నారు. నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టుగా దుర్భాషలాడితే ఊరుకునేది లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలపై జరుగుతున్న దాడులను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. నగరి శాసనసభ్యుడు గాలి భానుప్రకాష్‌ కూడా రోజాను అవమానపరుస్తూ మాట్లాడుతున్నారని, ఇది సరికాదని సూచించారు. సమావేశంలో ఆయనతో పాటు ఎస్సీ సెల్‌ నాయకులు తెలుగు నాగరాజు, సిమ్మా ఎర్రప్పడు ఉన్నారు.